# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 23-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

❖ దేశంలోని యువత సామర్థ్యాన్ని, ప్రతిభను పూర్తిగా వినియోగించుకోవడం ప్రభుత్వ ప్రాధాన్యత అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.

❖ వ్యవసాయం గ్రామీణాభివృద్ధికి వెన్నెముక అని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు.

❖ జాతీయ మానవహక్కుల కమిషన్ నూతన ఛైర్మన్‌గా సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు.

❖ ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి ఖాళీగా ఉన్న మెడికల్ సీట్లను భర్తీ చేయాలని మెడికల్ కౌన్సెలింగ్ కమిటీని సుప్రీంకోర్టు ఆదేశించింది.

❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29న ప్రసారమవుతుంది.

===========================

దేశంలోని యువత సామర్థ్యాన్ని, ప్రతిభను పూర్తిగా వినియోగించుకోవడం ప్రభుత్వ ప్రాధాన్యత అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మార్చే లక్ష్యంలో భాగంగా ప్రతిభావంతులైన యువతకు సాధికారత కల్పించడంపై దేశ విధానాలు, నిర్ణయాలు దృష్టి సారిస్తాయని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. ఈరోజు దేశ వ్యాప్తంగా జరిగిన “రోజ్ ఘర్ మేళా” కార్యక్రమంలో వర్చువల్ విధానంలో పాల్గొన్న ప్రధానమంత్రి 71 వేలకు పైగా నియామక పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత ఏడాదిన్నర కాలంలో దేశంలోని యువతకు దాదాపు 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. “రోజ్ గార్ మేళా” కార్యక్రమంతో దేశయువత కలలు సాకారమవుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

===========================

మాజీ ప్రధానమంత్రి చౌదరి చరణ్ సింగ్ జయంతి సందర్భంగా ఈరోజు దేశ వ్యాప్తంగా జాతీయ రైతు దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. దేశ అభివృద్ధిలో రైతులు చేసిన కృషిని గుర్తిస్తూ.. 2001 నుండి ప్రతీ సంవత్సరం డిసెంబర్ 23న రైతు దినోత్సవంగా జరుపుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతులకు ఆర్థిక భద్రత, నష్ట నివారణ, దీర్ఘకాలిక సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, పీఎం ఫసల్ బీమా యోజన, పీఎం కిసాన్ మంధన్ యోజన వంటి అనేక కార్యక్రమాలు చేపడుతోంది. చౌదరి చరణ్ సింగ్ జయంతి సందర్భంగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఆయనకు నివాళులు అర్పించారు. చౌదరి చరణ్ సింగ్ రైతుల నిజమైన శ్రేయోభిలాషి అని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు.

===========================

జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) నూతన ఛైర్మన్‌గా సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి. రామసుబ్రమణియన్ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్ర జూన్ 1న పదవీ విరమణ చేసినప్పటి నుంచి ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయ భారతీ తాత్కాలికంగా ఆ స్థానంలో కొనసాగారు. ఈ నేపథ్యంలో న్యాయమూర్తి రామసుబ్రమణ్యాన్ని నియమిస్తూ... రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా.. మానవ హక్కుల పరిరక్షణ కోసం ఏర్పాటైన ఈ కమిషన్‌కు ఛైర్మన్‌గా సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తులు లేదా ఇతర విశ్రాంత న్యాయమూర్తులను నియమించడం ఆనవాయితీగా వస్తోంది.

===========================

వ్యవసాయం గ్రామీణాభివృద్ధికి వెన్నెముక అని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు. గ్రామీణ స్వరూపం మారితే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతుందన్నారు. న్యూఢిల్లీలో చౌదరి చరణ్ సింగ్ అవార్డ్స్ 2024 గ్రహీతలతో ఈరోజు జరిగిన ముఖాముఖిలో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. రైతు కుటుంబాలు స్వయం సమృద్ధి సాధించడానికి మార్కెటింగ్ లో నిమగ్నమయితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందన్నారు. గ్రామీణాభివృద్ధి, రైతుల సంక్షేమం, సమ్మిళిత వృద్ధికి చౌదరి చరణ్ సింగ్ చేసిన కృషిని ఆయన ప్రశంసిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

విరామం

===========================

భారతదేశంలో వైద్యుల కొరత తీవ్రంగా ఉన్నందున నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల కోసం ఖాళీగా ఉన్న మెడికల్ సీట్లను భర్తీ చేయడానికి ప్రత్యేక రౌండ్ కౌన్సెలింగ్ నిర్వహించాలని మెడికల్ కౌన్సెలింగ్ కమిటీని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఖాళీగా ఉన్న ఎన్.ఆర్.ఐ. సీట్లను కూడా జనరల్ కేటగిరీ కోటాలో మారుస్తామని, వాటిని స్టేట్ అడ్మిషన్ అథారిటీల ద్వారా భర్తీ చేయాలని న్యాయమూర్తులు బి.ఆర్. గవాయ్, కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. విద్యార్థులను నేరుగా అడ్మిషన్ చేసుకోవడానికి ఏ కళాశాలను అనుమతించబోమని, స్టేట్ అడ్మిషన్ అథారిటీల ద్వారానే అడ్మిషన్లు నిర్వహించాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

===========================

ఉత్తరప్రదేశ్‌లోని పిలిభిత్ జిల్లాలో ఈరోజు ఉదయం ఉత్తరప్రదేశ్, పంజాబ్ పోలీసుల సంయుక్త బృందం నేతృత్వంలో జరిగిన కాల్పుల్లో ముగ్గురు ఖలిస్థాన్ అనుకూల ఉగ్రవాదులు మరణించారు. పంజాబ్‌లోని గురుదాస్‌పూర్‌లోని కొందరు ఖలిస్తాన్ అనుకూల ఉగ్రవాదుల అనుమానాస్పద కదలికలపై తమకు సమాచారం అందిందని పోలీసులు

తెలిపారు. పోలీసు బృందం వారిని పట్టుకోవడానికి ప్రయత్నించింది, కాని వారు పోలీసులపై కాల్పులు ప్రారంభించడంతో ఇది ఎన్‌కౌంటర్‌కు దారి తీసిందిన్నారు. కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన ఉగ్రవాదులను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినప్పటికీ వారు అప్పటికే మరణించినట్లు ప్రకటించారు. నిందితులను ఖలిస్తాన్ కమాండో ఫోర్స్ అనే నిషేధిత సంస్థకు చెందిన గుర్విందర్ సింగ్, వీరేంద్ర సింగ్, జసన్‌ప్రీత్ సింగ్‌లుగా గుర్తించామని ఉత్తరప్రదేశ్ ఎడిషనల్ డీజీ రమిత్ శర్మ పాత్రికేయులకు వివరిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

===========================

భారత విదేశీ వ్యవహారాల శాఖా మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ రేపటి నుంచి ఆరు రోజుల పాటు అమెరికాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా అమెరికాలో జరగనున్న భారత కాన్సుల్ జనరల్స్ సదస్సుకు జైశంకర్ అధ్యక్షత వహిస్తారు. అలాగే ద్వైపాక్షిక, ప్రాంతీయ ,ప్రపంచ సమస్యలపై పలు సమావేశాల్లో పాల్గొనున్నారు.

===========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

===========================

పరిపాలనాపరమైన నిర్ణయాలు సమాచారం ఆధారంగా తీసుకోవాలని నీతి ఆయోగ్ సీఈవో బి.వి.ఆర్. సుబ్రమణ్యం సూచించారు. ఈరోజు న్యూఢిల్లీలో కేంద్ర మంత్రిత్వ శాఖలు వివిధ విభాగాల్లోని గణాంక సలహాదారుల సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వంలోని ప్రతి భాగానికి డేటా చాలా కీలకమని, డేటా ఆధారంగా విశ్లేషణల ద్వారా నిర్ణయాలు తీసుకుంటే సరైన ఫలితాలను రాబట్టవచ్చన్నారు. గణాంకాలలో కొత్త సాధనాలు నూతన పద్ధతులను కొనసాగించడానికి నిరంతర నైపుణ్యం అవసరాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.

===========================
===========================